ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం అక్టోబరు 1, 2024 7

స్వచ్ఛత వైపు అడుగులు వేయండి: కలెక్టర్



బంతిపూల బతుకమ్మతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజలు మొక్కలు నాటడంతోపాటు, స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ్)- స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం బతుకమ్మ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాలు, మెప్మా సంఘాలు, ఐసీడీఎస్ మహిళలు, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు సుమారు 200 మంది వరకు పాల్గొన్నారు. పచ్చదనం, స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై రంగవల్లులు తీర్చిదిద్దారు. వీరితో పాటు పలు పోటీల్లో గెలిచిన పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా బహుమతులు అందజేశారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఇ.ఇందిర, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై సూచనలు.. ఖరీఫ్ ధాన్యం సేకరణను ప్రణాళిక ప్రకారం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ, సహకార, డీఆర్‌డీఏ, మార్కెటింగ్, జీసీసీ శాఖాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో సాగవుతున్న వరి వంగడాల వివరాలను సేకరించాలన్నారు. రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను వేగవంతం చేయాలన్నారు. టార్పాలిన్లు, తేమ యంత్రాలను ఉంచాలన్నారు. అధికారులు త్రినాథ్, రుక్మిణి, నరేందర్, బాబురావు, సదానందం, మనోహర్ పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు

పోస్టు	● ఖమ్మం	● భద్రాద్రి
ఎస్ఏ	176	129
ఎల్పీ	18	10
పీఈటీ	10	1
ఎస్‌జీటీ	334	268
ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)	8	8
ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	29	31

ఖమ్మం విద్యావిభాగం, కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలను సోమవారం విడుదల చేసింది. 2024, జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు మార్చిలో నోటిఫికేషన్ విడులైంది. పరీక్ష జరిగిన రెణ్నెల్లలోనే ఫలితాలు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని పలువురు అభ్యర్థులు ప్రతిభ కనబరిచారు. ధ్రువపత్రాల పరిశీలన తర్వాత ఎంపికైన వారి తుది జాబితా ప్రకటిస్తారు. ఖమ్మం జిల్లాలో 575, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 447 పోస్టులను భర్తీ చేయనున్నారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఈ నెల 1వ నుంచి 5 వరకు ఖమ్మం నగరం రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాత కొత్తగూడెం ఆనందఖని జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో నిర్వహించనున్నట్లు డీఈవోలు సోమశేఖరశర్మ, ఎం.వెంకటేశ్వరాచారి ప్రకటించారు. పరిశీలనకు డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు 1:3 నిష్పత్తిలో వెబ్‌సైట్‌లో పొందుపరిచిన అభ్యర్థులు మాత్రమే హాజరు కావాల్సి ఉంటుంది. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత తేదీల్లో హాజరై పరిశీలన చేయించుకోవాలి. జాబితాను ఇప్పటికే వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు....

అభ్యర్థుల ధ్రువపత్రాల కోసం ప్రత్యేక కేంద్రాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులతో పాటు క్లర్కులు ధ్రువపత్రాలను పరిశీలిస్తారు. అక్టోబరు రెండో తేదీ గాంధీ జయంతి అయినా ధ్రువపత్రాల పరిశీలనకు సెలవు ఉండదు. అర్హులైన అభ్యర్థుల జాబితాను పరిశీలన అనంతరం జాబితాను రాష్ట్ర అధికారులకు పంపుతారు. దీనికి ఎలాంటి ఇంటర్వ్యూ ఉండదు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగులు ఇస్తారు. అనంతరం ఈ నెల 9న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదగా కొత్త ఉపాధ్యాయులు నియామకపత్రాలను అందుకోనున్నారు.

కష్టాల కడలి దాటి.. కొలువు సాధించి



వేకులపల్లి న్యూస్‌టుడే: ఉపాధ్యాయ కొలువు అతని కల. తన ప్రయాణంలో ఎన్నో కష్టాలు అనుభవించారు. జీవిత భాగస్వామి దూరమైనా కలత చెందలేదు. సొంతంగా పరీక్షకు సిద్ధమవుతూనే.. రెక్కల కష్టంతో తనయలను ఉన్నతంగా చదివించారు. తాజా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులతో శెభాష్ అనిపించుకున్నారు. బేతంపూడి గ్రామానికి చెందిన సరికొండ నాగేశ్వరరావు (43) పంచాయతీ గుమాస్తా (మల్టీపర్పస్ వర్కర్)గా 2001 నుంచి పనిచేస్తున్నారు. 1998లో కోయగూడెంకు చెందిన సునీతతో వివాహమైంది. పదో తరగతితో చదువు నిలిపేసినా.. తర్వాత అంబేడ్కర్ వర్సిటీ నుంచి దూరవిద్యలో డిగ్రీ పట్టా అందుకున్నారు. బీఈడీ రెగ్యులర్, డిస్టెన్స్‌లో పీజీ చేశారు. టీచర్ కొలువుకు సిద్ధమయ్యారు. గతేడాది అనారోగ్యంతో భార్య కాలం చేశారు. అయినా మనోధైర్యం వీడలేదు. వ్యవసాయం కూడా చేస్తూ కుమార్తె నాగరాణిని డిగ్రీ, సింధును పీజీ చదివించారు. తాజా డీఎస్సీ ఫలితాల్లో తెలుగు పండిట్ జిల్లా స్థాయిలో 9వ, ఎస్సీ కేటగిరీలో 1వ ర్యాంకు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లోనూ జిల్లాస్థాయి 26వ, ఎస్సీ కేటగిరీలో 3వ ర్యాంక్ పొందడం విశేషం.

అందిద్దాం.. గౌరవప్రద జీవితం

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

గతాన్ని భవిష్యత్తుతో పెనవేస్తూ.. వర్తమానానికి వారధులుగా నిలిచే సాక్ష్యాలే వయోవృద్ధుల గాథలు. ప్రస్తుత సమాజంలో కుటుంబం, సమాజంతో పాటు ఆరోగ్యపరంగా వారెదుర్కొంటున్న సవాళ్లెన్నో. ఆందోళనకు లోనుకాకుండా ఆలోచించి ఆయా సవాళ్లను అధిగమించేందుకు పలు మార్గాలున్నాయి. ఆయా వివరాలపై 'నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ' ప్రత్యేక కథనం.

సంరక్షణ, సహాయ వ్యవస్థల బలోపేతానికి 'గౌరవంతో కూడిన వృద్ధాప్యం' అని ఐక్యరాజ్య సమితి ఈ ఏడాది నినదిస్తోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైన దరిమిలా సీనియర్ సిటిజన్లను ఎన్నో సమస్యలు వేధిస్తున్నాయి. ఒంటరితనం, చుట్టుముట్టే ఆరోగ్య సమస్యలు, వయోభారం శాపాలవుతున్నాయి. ఈ క్రమంలో తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం చూపేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా కేంద్రం చట్టాన్ని రూపొందించింది. అదే.. 'వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం-2007'. చట్టం నిబంధనలు ఏం చెబుతున్నాయో వారసులు గమనించి.. తమ బాధ్యతలు నెరవేర్చాలని అధికారులు, న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

★ వయోవృద్ధుల ఆరోగ్య ఖర్చులు కాలక్రమేణా పెరుగుతున్నాయి. మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సమస్యలు, కీళ్లనొప్పుల చికిత్సలు ఖర్చుతో కూడుకున్నవి. చాలామంది వృద్ధులు పింఛను, పదవీ విరమణ డబ్బులు వంటి స్థిర ఆదాయాన్ని ఇందుకు వెచ్చిస్తున్నారు. ఈ వెసులుబాటు లేనివారు కుటుంబ సభ్యుల గౌరవ మర్యాదలకు నోచుకోవడం లేదు. కానీ, తమ బాధ్యతను విస్మరించిన వారసులపై కఠిన చర్యలు తీసుకునే అధికారం చట్టానికి ఉంది.

★ వృద్ధుల పిల్లలంటే కుమారుడు, కుమార్తె కాదు.. మైనార్టీ తీరిన మనవళ్లు, మనమరాళ్లు కూడా అని చట్టం చెబుతోంది. వయసు మీరిన వారి సంరక్షణ.. వీరి బాధ్యత.

★ బాధ్యతంటే.. ఆహారం, దుస్తులు, నీడ కల్పించడం, సుస్తీ చేస్తే దవాఖానాలో చికిత్స చేయించడం.

★ సవతి తల్లి దండ్రుల పోషణ బాధ్యత పిల్లలపైనే ఉంటుంది.

వయోవృద్ధులు
ఖమ్మం: 1,80,000
భద్రాద్రి.. 1,50,000



వయసు మీద పడిందని.. జీవన భరోసా కల్పించి తమను ఆదుకోవాలని ఖమ్మం కలెక్టరేట్‌కు వచ్చిన వైరా మండలం పాలడుగుకు చెందిన వృద్ధ దంపతులు రామిశెట్టి బాబురావు, శాంతమ్మ

ముందు చూపుతోనే భరోసా

● వృద్ధుల వైద్యానికి భరోసా కల్పించేందుకు సమగ్ర ఆరోగ్య బీమా పాలసీలు తోడ్పడతాయని ఆ రంగ నిపుణులు చెబుతున్నారు. కుటుంబీకులు ముందుచూపుతో వీటిని తీసుకుంటే.. పరీక్షలు, శస్త్రచికిత్సల అనంతరం సేవలు పొందేందుకు కావాల్సిన డబ్బు చెల్లిస్తాయి. గుండెపోటు, క్యాన్సర్ వంటి తీవ్ర సమస్యల వ్యయాలను భరిస్తాయి. బీమా వర్తింపులో వెసులుబాట్లు కల్పిస్తూ ఇటీవల భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) నిర్ణయాలు వెలువరించింది. వీటివల్ల మెరుగైన బీమా అందుబాటులోకి వస్తోంది.

● కేంద్రం ఆయుష్మాన్ భారత్-పీఎం జన్ ఆరోగ్య యోజన పేరుతో పేద, ధనిక తేడాలేకుండా రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 3.3 లక్షల మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరనుంది.

● జిల్లా సర్వజన ఆసుపత్రుల్లో పాలియేటివ్ కేర్ కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలను సిబ్బంది నిరంతరం అందిస్తున్నారు.



వృద్ధాప్య అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు ఆరోగ్య బీమా ఉత్తమమైనది. కానీ.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రతి వంద మందిలో కేవలం ఇద్దరు, లేదా ముగ్గురికే ఈ సదుపాయం ఉంది. 'భవిష్యత్తులో ఎదురయ్యే అనారోగ్య సమస్యల్లోంచి సీనియర్ సిటిజన్లను బయటపడేసే బీమా మార్గాలపై అధికారులు అవగాహన కల్పించాలి' అని కొత్తగూడెంకు చెందిన బీమా సలహాదారు **ఎం.సాంబశివరావు** అన్నారు.



'పిల్లల ఆదరణకు నోచుకోని బాధితులు నేరుగా గానీ, పోస్టు ద్వారా ఆర్డీవో అధ్యక్షతన ఏర్పాటైన వృద్ధుల సంక్షేమ కమిటీలకు తెలపొచ్చు. '14567' టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. జిల్లా కేంద్రాల్లో సంక్షేమశాఖ 'డే కేర్' కేంద్రాలు నిర్వహిస్తోంది. వృద్ధులకు ఉమ్మడి జిల్లాలో 10 వేల గుర్తింపు కార్డులు కూడా మంజూరు చేశాం.

- కె రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి, ఖమ్మం

ఎస్పీ ఎదుట సమస్యలపై ఏకరువు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: గ్రీవెన్స్ డేలో అందిన ఫిర్యాదులు, సమస్యలపై పోలీసు అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ బి.రోహిత్‌రాజు సూచించారు. తన చాంబర్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 15 మంది బాధితులు వారి సమస్యలను ఎస్పీకి తెలిపారు. నలుగురు బాధితులు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో తమ ఫిర్యాదుల మేరకు నమోదైన కేసుల్లో జాప్యం జరుగుతుందని త్వరగా విచారణ నిర్వహించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. దొంగతనం కేసులో పోగొట్టుకున్న సొత్తు అందేలా చూడాలని, కుటుంబ కలహాలను పరిష్కరించాలని మరికొందరు వేడుకున్నారు.

ముత్తంగి రూపంలో రామయ్య దర్శనం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాల వస్త్రాలంకృతుడైన రామయ్య తండ్రిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి కంకణ ధారణ కొనసాగించారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ కనుల పండువగా నిర్వహించారు. మాంగల్య ధారణ, తలంబ్రాల వేడుక, దర్బారు సేవలో భక్తిశ్రద్ధలతో సాగాయి.

'పనిభారం పెరిగింది.. సర్వే చేయలేం'

కొత్తగూడెం వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని 23 మండలాల ఏఈవోలు తమ సమస్యలను తెలుపుతూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబురావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఈవోల సంఘం గౌరవ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ... డిజిటల్ క్రాప్ సర్వేను నిర్వహించడానికి గ్రామస్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలని, జిల్లాలో వ్యవసాయ విస్తీర్ణం ఆధారంగా 128 మంది ఏఈవోలు అవసరం ఉందని, కానీ ప్రస్తుతం 67 మంది ఏఈవోలు మాత్రమే ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న ఏఈవోల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఈవోల అధ్యక్షుడు బి.నరసింహారావు, ఉపాధ్యక్షులు సాహిత్య, సందీప్, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, అనూష తదితరులు పాల్గొన్నారు.



డీఏవో బాబురావుకు వినతిపత్రం ఇస్తున్న ఏఈవోలు

ఇసుక తోడేస్తున్న సిండికేటుగాళ్లు

కొత్తూరు గ్రామ శివారులోని సీతారామ కాలువ వద్ద అక్రమ ఇసుక నిల్వలు



నిఘా

ములకలపల్లి, అశ్వారావుపేట, న్యూస్‌టుడే

మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అరికట్టే వారే కరవయ్యారు. పగలు రాత్రి తేడా లేకుండా అడ్డగోలుగా ఇసుక తోడేస్తున్నా. . ఎవ్వరూ నోరుమెదపని పరిస్థితి. దీంతో ఇసుక అక్రమార్కులు సిండికేట్‌గా ఏర్పడి ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారు. వీరికి అధికారుల అండదండలూ పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నారు. సిండికేట్‌ను కాదని వేరెవరైనా ఇసుక తోలితే అధికారులు రెక్కలు కట్టుకుని వాలిపోయి, వారి వాహనాలు సీజ్ చేస్తున్నారు.

అధికారుల కదలికలపైనే నిఘా..!

ఇసుక సిండికేట్ రాయుళ్లు పోలీసులు, రెవెన్యూ అధికారుల రాకను పసిగట్టేందుకు పాల్వంచ, ములకలపల్లి, పాల్వంచ రూరల్ పోలీసులపై పాల్వంచ బస్‌స్టాండ్, అంబేడ్కర్ సెంటర్, దమ్మపేట అడ్డరోడ్డు, శివానగర్ ప్రాంతాల్లో, ములకలపల్లి మండలంలోని మాధారం, సీతారామ ప్రాజెక్టు, పూసుగూడెంలలో వేగులను ఏర్పాటు చేసుకుంటున్నారు. సాయంత్రం మొదలు వారు రాత్రి అధికారులు ఇళ్లకు చేరేవరకు ప్రతి కదలికను కనిపెడుతున్నారు.

ప్రభుత్వ రీచ్‌లు లేకపోవడంతో..

మండలంలో అధికారిక ఇసుక రీచ్(ర్యాంపులు) లేకపోవడంతో, ఇళ్ల నిర్మాణాలకు, ఇతర పనులకు ఇసుకను అక్రమ మార్గంలో ప్రజలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీన్ని అవకాశంగా మలచుకున్న అక్రమార్కులు కూతవేటు దూరంలో వాగులున్న గ్రామాలకు సైతం ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ. 1500 నుండి 2000 వరకు వసూలుకు పాల్పడుతున్నారు. అక్రమార్కులు లాభాలను గడిస్తూ.. పంచాయతీలకు లక్షల్లో వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. అనధికారిక రీచ్‌లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి, ప్రజలకు లాభదాయకంగా ఉంటుంది.

సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం..

మండలంలో ఇసుక రవాణా చేసేందుకు ఎవరికీ అనుమతులు లేవు. ఇసుక, మట్టి తోలకాలపై సమాచారమిస్తే దాడులు చేసి తగు చర్యలు తీసుకుంటాం.

పుల్లారావు, ములకలపల్లి తహసీల్దార్

సరిహద్దు మాటున.. దందా సాగుతోందిలా...

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి అయిదు కి.మీ. లోపులోనే వాగులున్నాయి. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న ముర్రేడు వాగు నుంచి పాల్వంచ, ములకలపల్లి మండలాల సరిహద్దులోని నిర్మాణ దశలో ఉన్న ఫామ్ హౌస్‌లు, భవనాలు, గృహసముదాయాల వెనుక భాగంలో ఇసుక నిల్వ చేస్తారు. అనంతరం లారీలలో శ్రీనివాసకాలనీ, శివనగర్ మీదుగా పాల్వంచ పట్టణానికి తరలిస్తున్నారు. ములకలపల్లి మండలం పూసుగూడెం, సీతారామ ప్రాజెక్టు కాలువ, రామాంజనేయపురం, చాపరాళ్లపల్లి మీదుగా సత్తుపల్లి, తిరువూరు ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా ప్రతి రోజు 5 నుంచి పది లారీల ఇసుక అక్రమంగా తరలుతోంది. ములకలపల్లి మండలం కొత్తూరు శివారులోని సీతారామ కాలువ సమీపంలో ఇసుకను అక్రమ నిల్వచేసిన చిన్నపాటి ఇసుక డంప్‌ను 'న్యూస్‌టుడే' సోమవారం గుర్తించింది.

B.Ed, M.Ed B.P.Ed సీట్లు కలవు
Cont: 8106729941

IN THE COURT OF THE HON'BLE II-ADDL. SENIOR CIVIL JUDGE AT HANUMAKONDA
O.S. No. 52 of 2024
Between :-
Kodati Madhupal and 2 others ...Plaintiffs
AND
Achakatla Kumara Swamy and 10 others ...Defendants
To
DEFENDANT NO.5: Koke Veeraiah, S/o: Venkaiah, Age: 42 years, Occu: Business, R/o: Qr. No.DA-855, Nehru Basthi, Ramavaram, Kothagudem, Khammam District at present Bhadradri Kothagudem District., presently residing at H.No. 2-7-1137/G-1, Kanakadurga colony, Hanumakonda District.
Please take notice that the plaintiffs have filed the above suit, against you and others for grant of Permanent Injunction along with I.A. No.9/2024 for grant of Temporary injunction order against you & others. The above suit and injunction petition in I.A. No.9/2024 is posted **28.10.2024** for your appearance. Therefore you are hereby directed to appear before the Hon'ble court on **28.10.2024 at 10:30 am** failing which the matter will be decided in your absence.
// BY THE ORDER OF THE COURT//
Sd/-, **CH.SWAMYNATHAN,** ADVOCATE
H.NO. 12-1-70, S.V.N.ROAD, WARANGAL
Cell: 9848011373

IN THE COURT OF THE HON'BLE II-ADDL. SENIOR CIVIL JUDGE AT HANUMAKONDA
O.S. No. 53 of 2024
Between:-
Pinninti Vijay Kumar and another ...Plaintiffs
AND
Achakatla Kumara Swamy and 10 others ...Defendants
To
DEFENDANT NO.5: Koke Veeraiah, S/o: Venkaiah, Age: 42 years, Occu: Business, R/o: Qr. No. DA-855, Nehru Basthi, Ramavaram, Kothagudem, Khammam District at present Bhadradri Kothagudem District., presently residing at H.N0.2-7-1137/G-1, Kanakadurga colony, Hanumakonda District.
Please take notice that the plaintiffs have filed the above suit, against you and others for grant of Permanent Injunction along with I.A. No.10/2024 for grant of Temporary injunction order against you & others. The above suit and injunction petition in I.A. No. 10/2024 is posted **28.10.2024** for your appearance. Therefore you are hereby directed to appear before the Hon'ble court on **28.10.2024 at 10:30 am** failing which the matter will be decided in your absence.
// BY THE ORDER OF THE COURT//
Sd/-, **CH.SWAMYNATHAN,** ADVOCATE
H.NO. 12-1-70, S.V.N.ROAD, WARANGAL
Cell: 9848011373

ఉక్కపోత.. ఎన్నాళ్లీ వెత



నిరీక్షిస్తున్న బాలింతలు, సహాయకులు..☛

కొత్తగూడెం రామవరంలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో రక్త పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు ఉక్కపోత తప్పడం లేదు. పరీక్షల గదివద్ద కనీసం ఒక్కటైనా ఫ్యాన్ ఏర్పాటు చేయలేదు. నవజాత శిశు ఓపీ కేంద్రంలో నర్సింగ్ స్టేషన్ వద్ద కూడా ఇదే పరిస్థితి. దీంతో బాలింతలు, వారి సహాయకులతో పాటు నర్సులు కూడా ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడ సేవల కోసం గర్భిణులు 200-300, నవజాత శిశువుల ఓపీ 170 వరకు ఉంటోంది. ఆసుపత్రి నిర్వాహకులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. త్వరలో ఫ్యాన్లను ఏర్పాటు చేయిస్తామన్నారు.

– కొత్తగూడెం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గం నియామకం



వెంకటేశ్వరరావు



రవి

కొత్తగూడెం విద్యావిభాగం: పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ అధ్యక్షతన ప్రకటించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డి.వెంకటేశ్వరరావు, బి.రవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్‌కే జహంగీర్ షరీఫ్, నరసయ్య, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా దుర్గాభవాని, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జాతీయ స్థాయి సెమినార్‌లో జిల్లా అధికారులు..

అశ్వారావుపేట: అసోంలోని గౌహతిలో సోమవారం జరిగిన ఆయిల్‌పాం జాతీయస్థాయి సెమినార్‌లో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఉమ్మడి జిల్లా డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ, ఆయిల్‌ఫెడ్ కన్సల్టెంట్ బి.రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సుస్థిర ఆయిల్‌పాం సాగు, విస్తరణ, సంస్థాగత నిర్మాణ అంశాలపై చర్చించారు.

తలాపున నీరున్నా.. తడారని గొంతులు



ఇందిరానగర్ కాలనీ జీసీసీ కార్యాలయం సమీపంలో భారీ లీకేజీ

పాల్వంచ, న్యూస్‌టుడే

సీజన్‌తో నిమిత్తం లేకుండా పాల్వంచ పురవాసులను తాగునీటి కష్టాలు వెన్నాడుతున్నాయి. సరఫరాలో చూపుతున్న నిర్లక్ష్యమే కన్నీటికి కారణం. పట్టణానికి సమీపంలో కిన్నెరసాని జలాశయం ఉంది. పక్కనుంచి ముర్రేడు వాగు ప్రవహిస్తోంది. మరోవైపు మిషన్ భగీరథ పథకం అందుబాటులోకి వచ్చింది. ఇన్ని వనరులు, సౌకర్యాలున్నా పట్టణ వాసులకు ఊరట కలగడం లేదు. తరచూ పైపులైన్ల లీకేజీలు తలెత్తుతున్నాయి. కలుషిత జలాల సమస్యతో ఈ సీజన్‌లో అతిసారం, విరేచనాలు, టైఫాయిడ్ జ్వరం తదితర నీటి జనిత వ్యాధులు ప్రబలుతున్నాయి. మొత్తం 24 వార్డుల్లో నిత్యం ఎక్కడో ఒకచోట లీకేజీ సమస్య తలెత్తుతోంది. బాధితులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రైవేటు ఆసుపత్రులకు వరుస కడుతున్నారు.

భారీ లీకేజీలతో శుద్ధజలాలు వృథా

ఇటీవల కాలంలో అన్ని వార్డుల్లో పురపాలక అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 200కి పైగా లీకేజీలను గుర్తించారు. వాటికి మరమ్మతులు చేశారు. భగీరథ పైపులైన్లు తరచూ ఎక్కడో ఒకచోట పగిలిపోతున్నాయి. సమస్యపై స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నా అధికారులు, సిబ్బంది సకాలంలో పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల పై కాలనీలకు సరఫరాలో అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా శివారు కాలనీల్లో నీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. మిషన్ భగీరథ ట్యాంకులు పూర్తికాకపోవడంతో పాల కొయ్యతండా, శేఖరంబంజర్, కేసీఆర్‌నగర్, ఎర్రగుంట, జగ్గుతండా, రాజీవ్ నగర్, సోనియానగర్, గుడిపాడు, పేటచెరువు, కొత్తూరు, పిల్లవాగు, బంగారుజాల తదితర కాలనీలకు శుద్ధ జలాలు ఇప్పటికీ అందని ద్రాక్షలా మారాయి.





"మా కాలనీకి రెండు నెలలుగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఇదే విషయాన్ని పలుమార్లు పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అరకొర సరఫరా జరుగుతున్నా.. అది కలుషిత నీరే. తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి."

- సంధ్యశ్రీ, రాహుల్‌గాంధీనగర్



కరకవాగుకాలనీలో కలుషిత నీటి సరఫరా



"మిషన్ భగీరథ పైప్‌లైన్లు పూర్తయినా.. ట్యాంకుల నిర్మాణం జాప్యం జరగడంతో కొన్ని కాలనీలకు శుద్ధజలాల సరఫరా జరగడం లేదు. ఆయా పనులు పూర్తికావచ్చాయి. సమస్య త్వరలో తీరుతుంది. శివారు కాలనీల్లో ఎద్దడి లేకుండా చూస్తాం. మిగతా చోట్ల లీకేజీలను గుర్తించాం. అవన్నీ సరిచేస్తున్నాం."

- స్వరూపారాణి, పురపాలక డీఈ

నమూనా ప్రకటన
బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా అందరికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటుయగు శ్రీ...................... ......నివాసంగా శ్రీ......................వారికి చెందినటువంటి గృహము ఇంటినెం. మరియు ఖాళీ జాగా, ఈ క్రింది హద్దులు గల ఉత్తరం: ఇతరుల ఖాళీ జాగా, దక్షిణం: 20 ఫీట్ల రోడ్డు, తూర్పు: ఇతరుల ఖాళీ జాగా, పడమట:..................గారి ఇల్లు, పట్టణంలో గల దానిని కొనడానికి అగ్రిమెంటు కుదుర్చుకున్నారు. మరియు అడ్వాన్సు కూడా ఇచ్చియున్నారు. ఇట్టి విషయంగా ఎవరికైనా ఆక్షేపనలు ఉన్న ఎడల వారం రోజులలోగా సాక్ష్యములతో సహా నన్ను సంప్రదించగలరు. ఆ తరువాత వచ్చే ఎటువంటి క్లయిమ్‌లు నా క్లయింటును బైండు చేయజాలవు.
సం/-
అడ్వకేట్

విజ్ఞతగల నిర్ణయం వివాదాలకు అతీతం



లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం.
'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
ప్రకటనలపై **25% డిస్కౌంట్**
GST 5% అదనం
వివరాలకు సంప్రదించండి:
ఖమ్మం: 8008510764, 8008709925, 8008709924
కొత్తగూడెం: 8008709920, సత్తుపల్లి: 8008001776
భద్రాచలం, మధిర, ఇల్లెందు: 8008510764

(c) eenadu

ఈ విజయం అద్భుతం గురూ..!

ప్రతి ఒక్కరికీ ఒక కల ఉంటుంది. కానీ, పట్టువదలకుండా శ్రమిస్తేనే అది నెరవేరుతుంది. ఈ ప్రయాణంలో ఎదురయ్యే కష్టాలెన్నో. అధిగమించాల్సిన అవరోధాలు ఇంకెన్నో. దేనికీ వెరవకుండా, పట్టుదలతో, ప్రేరణతో, ఓపిగ్గా ముందుకు సాగితేనే గమ్యం దరిచేరుతుంది. ఇదే నిరూపించారు.. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు డీఎస్సీ విజేతలు. తాజాగా పోటీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. పలు సబ్జెక్టులు, కేటగిరీల్లో జిల్లా ప్రథమ స్థానాల్లో నిలిచిన పలువురి నేపథ్యాన్ని పరిశీలిస్తే.. విజయం వెనుక దాగిఉన్న కష్టమెంతో తెలుస్తుంది. సాధించిన లక్ష్యం అద్భుతం అనిపిస్తుంది. పలువురు విజేతలను 'హ్యాట్సాఫ్ గురూ..!' అని బంధుమిత్రులు అభినందిస్తున్నారు. - న్యూస్‌టుడే యంత్రాంగం





నీలా శ్రీనివాసరావు
నరసింహారావు, రాములమ్మ
★ సత్తుపల్లి మండలం రామనగరం
1 (స్కూల్ అసిస్టెంట్, సోషల్) (ఖమ్మం జిల్లా)
నిరుపేద కుటుంబం. ఓయులో ఎంఏ, సత్తుపల్లిలో బీఈడీని పూర్తి చేశారు. 2018 డీఎస్సీలో 0.4లో ఉద్యోగం చేజారింది. ఈసారి పట్టుదలతో చదివి జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచారు. – సత్తుపల్లి, న్యూస్‌టుడే



రెడ్డి మాధురి
భర్త: రెడ్డి శివకృష్ణ
★ కల్లూరు మండలం చిన్నకోరుకొండి
1 (ఎస్జీటీ), (ఖమ్మం జిల్లా)
మాధురి భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం బీపీఎంగా 2018 నుంచి పనిచేస్తున్నారు. 2016 డీఎస్సీలో విజయం దక్కలేదు. అయినా పట్టుదలతో.. కోచింగ్ లేకుండానే అయిదు నెలల పాటు చదివారు. ఎస్జీటీలో ఖమ్మం జిల్లా ప్రథమ ర్యాంకు సాధించారు. ఈమె భర్త శివకృష్ణ కూడా డీఎస్సీ రాసి ఎస్జీటీలో భద్రాద్రి జిల్లా 26వ ర్యాంకర్‌గా నిలవడం విశేషం. ఆయన ప్రస్తుతం దమ్మపేట మండలం మల్కారం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. – అశ్వారావుపేట, న్యూస్‌టుడే




శీలం తిరుపతిరెడ్డి
వెంకట్రామిరెడ్డి, పద్మావతి ★ తల్లాడ
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ విభాగంలో జిల్లా స్థాయి 1వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య విభాగంలో 3వ ర్యాంకు (ఖమ్మం జిల్లా).
నాలుగు పీజీలు పూర్తి చేశారు. 2015లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం కామేపల్లి మండలం గోవింద్రాలలో పనిచేస్తున్నారు. – తల్లాడ, న్యూస్‌టుడే

పేరు: మిద్దే హరికిరణ్
తల్లిదండ్రులు: తల్లి చెన్నమ్మ గృహిణి.
★ గ్రామం: దమ్మపేట మండలం మొద్దులగూడెం
ర్యాంకు:1, ఎస్ఏ ఫిజికల్ సైన్స్, హైదరాబాద్ జిల్లా
ప్రత్యేకత: హరికిరణ్ దమ్మపేట మండలంలో ప్రభుత్వ వాలంటీర్‌గా పనిచేశారు. 2019 నుంచి కొడంగల్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. – దమ్మపేట, న్యూస్‌టుడే



పావురాల వినోద్‌కృష్ణ
★ భద్రాచలంలోని ఎంపీ కాలనీ
2 (ఎస్ఏ సోషల్) (భద్రాద్రి జిల్లా)
ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ చదివిన వినోదకృష్ణ పదేళ్ల కిందట డీఎస్సీ రాసినా ర్యాంకు రాలేదు. ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేస్తూనే ఈసారి ప్రిపేర్ అయ్యారు. 'కల నెరవేరింది. కొంత ఆలస్యమైనా పట్టుదల ఉంటే అనుకున్నది సాధించి తీరుతాం' అని నమ్ముతాను. – భద్రాచలం, న్యూస్‌టుడే





ఈలప్రోలు సునీత
సావిత్రి, కృష్ణ
★ చింతకాని మండలం ప్రొద్దుటూరు
3వ (ఎస్జీటీ, ప్రత్యేక విభాగం)(ఖమ్మం జిల్లా)
నిరుపేద కుటుంబానికి చెందిన సునీత తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే కొనసాగింది. భర్త వీరబాబు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే మూడో ర్యాంకు సాధించినట్లు సునీత తెలిపింది. - చింతకాని, న్యూస్‌టుడే



కురివీటి రవిబాబు
★ ములకలపల్లి మండలం నర్సాపురం
1, (ఎస్ఏ, ఆంగ్లం) (భద్రాద్రి జిల్లా)
ఎంఏ బీఈడీ పూర్తిచేసిన రవిబాబు అశ్వారావుపేట బీసీ బాలుర గురుకులంలో పీజీటీ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ఈ ఏడాది జూన్‌లో కొలువులో చేరారు. పట్టుదలతో చదివి తాజాగా డీఎస్సీలో విజయం సాధించారు. తొలి ప్రయత్నంలో 2018లో ఫలితం దక్కలేదు. – అశ్వారావుపేట, న్యూస్‌టుడే

భూక్యా సాయిరాం
భూక్యా చందా, జ్యోతి
★ జూలూరుపాడు మండలం పాపకొల్లు
2, (హిందీ పండిట్), (భద్రాద్రి జిల్లా)
సాయిరాం బీఏ బీఈడీ పూర్తి చేశాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు తమకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ కుమారుడిని చదివించారు. డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. – జూలూరుపాడు, న్యూస్‌టుడే





గోకినేపల్లి పవిత్ర
వెంకన్న- ఉపేంద్రమ్మ
★ తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు
14 (ఎస్జీటీ), (ఖమ్మం జిల్లా)
నిరుపేద కుటుంబం. తల్లి వ్యవసాయ కూలీ. తండ్రి దుస్తులు ఉతుకుతూ, ఇస్త్రీపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించారు. ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువుకుంది. – తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే



వలసాల ఉమ
భర్త: వెంకటేశ్వరరావు (ఉపాధ్యాయుడు)
★ కల్లూరు
2వ (ఎస్జీటీ), (ఖమ్మం జిల్లా)
భర్తే శిక్షకునిగా మారారు. అతని ప్రోత్సాహం, మార్గదర్శకంలో ఇంట్లోనే సిద్ధమయ్యారు. ఇద్దరు పిల్లల బాధ్యతలు నిర్వర్తిస్తూనే ర్యాంకు సాధించారు. - కల్లూరు, న్యూస్‌టుడే

సోందె ఆంజనేయులు
రాంబాబు, కనకమ్మ
★ దుమ్ముగూడెం మండలం మహదేవపురం
2, (ఎస్జీటీ), (భద్రాద్రి జిల్లా)
2015-17లో భద్రాచలం బీఈడీ కళాశాలలో డీఎడ్ చేసిన ఆంజనేయులు డిస్టెన్స్‌లో బీఏ చదివారు. వర్నావారిగుంపులో రెండేళ్లు విద్యా వాలంటీరుగా పని చేశారు. వీరిది వ్యవసాయ కుటుంబం. – దుమ్ముగూడెం, న్యూస్‌టుడే



యనరాతి సూరయ్య
వెంకటేశ్వర్లు, సూరమ్మ
★ బోనకల్లు మండలం తూటికుంట్ల
3వ (ఎస్.ఎ. ప్రత్యేక విద్య), (ఖమ్మం జిల్లా)
దళిత పేద కుటుంబంలో జన్మించారు. పెళ్లై ఇద్దరు పిల్లలున్నారు. 15ఏళ్లుగా ఐఈఆర్‌టీగా పనిచేస్తున్నారు. తండ్రి క్యాన్సర్‌లో పోరాడుతున్నారు. ఉద్యోగం సాధించాలన్న కసితో కోచింగ్ తీసుకోకుండా స్వయంగా మెటీరియల్ రూపొందించుకున్నారు. – బోనకల్లు, న్యూస్‌టుడే



చిల్లపల్లి రాధాకృష్ణ
నరసింహులు, వెంకమ్మ.
★ వేంసూరు మండలం కందుకూరు
7వ (ఎస్జీటీ)(ఖమ్మం జిల్లా)
సామాన్య రైతు కుటుంబం. అన్న గీతకార్మికుడు. ఇంటర్ తరువాత టీటీసీ పూర్తి చేశారు. జిల్లాలో బీసీ-బిలో మొదటి ర్యాంకు దక్కించుకున్నారు. – వేంసూరు, న్యూస్‌టుడే



మండవ ప్రియాంక
భర్త: సతీశ్ (కానిస్టేబుల్)
★ వల్లభి
11 (ఎస్జీటీ) (ఖమ్మం జిల్లా)
ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ఇంటి వద్ద ఉంటూ డీఎస్సీకి సిద్ధమైంది. వివాహమైన తర్వాతే బీఈడీ పూర్తి చేశారు. ఇంటి పనులు చేస్తూ ఖాళీ సమయాల్లో చదివినట్లు తెలిపారు. – ముదిగొండ, న్యూస్‌టుడే



రొయ్యల గణేశ్
సత్యనారాయణ, కళావతి
★ అశ్వారావుపేట మండలం వినాయకపురం
3 (ఎస్జీటీ) (భద్రాద్రి జిల్లా)
గణేశ్‌ది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి ప్రభుత్వ కొలువు సాధిస్తేనే తమ కష్టాలు తొలుగుతాయని ఆయన భావించారు. పట్టువదలని విక్రమార్కుడిలా డీఎస్సీకి సన్నద్ధమై.. తొలి ప్రయత్నంలోనే ఉపాధ్యాయ వృత్తికి ఎంపికయ్యారు. - అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే



ఏనిక రవీందర్
★ ఎలకలగూడెం (అశ్వాపురం)
8 (ఎస్జీటీ, ఎస్టీ కేటగిరీ) (భద్రాద్రి జిల్లా)
తండ్రి లేని రవీందర్‌ది ఓ సాధారణ కుటుంబం. విద్యంతా ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో సాగింది. ఆపై ఇంటర్, టీటీసీ చదివి, ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా కష్టపడి విజయం సాధించారు. – అశ్వాపురం, న్యూస్‌టుడే

సేవా హృదయం.. దివ్యాంగుడికి ఊతం

స్పందనకు వందనం

తల్లాడ, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడిమకు చెందిన ఆదూరి యేసు మేకలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈయన భార్య మార్తమ్మ మానసిక దివ్యాంగురాలు. వీరి పెద్ద కుమారుడు రమణయ్య పుట్టుకతోనే దివ్యాంగుడు. రెండో కుమారుడు జీవన్ పుట్టుకతోనే పోలియో బారిన పడ్డారు. కుటుంబ దయనీయ పరిస్థితిపై గత నెల 22న 'ఈనాడు'లో 'కన్నీటి కష్టాలు తీర్చండి సారూ..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన హైదరాబాద్‌కు చెందిన 'సేవా' స్వచ్ఛంద సంస్థ జీవన్ వినియోగించుకునేందుకు వీలుగా అధునాతన చక్రాల కుర్చీని 'ఈనాడు' ద్వారా పంపింది. దీన్ని కలకొడిమలో జీవన్‌కు సోమవారం 'ఈనాడు' ప్రతినిధి అందజేశారు. 'సేవా' స్వచ్ఛంద సంస్థకు, 'ఈనాడు'కు యేసు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



చక్రాల కుర్చీతో ఆదూరి జీవన్, కుటుంబ సభ్యులు



కన్నీటి కష్టాలు తీర్చండి సారూ..

'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

ఆర్నెల్లు.. నాలుగు కొలువులు!


అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: నేటి పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ కొలువు సాధించడమే కష్టం. అలాంటిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి పెద్దిరాజు ఆరు నెలల వ్యవధిలోనే నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను తన ఖాతాలో వేసుకొని, నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిశాడు. సోమవారం విడుదలైన డీఎస్సీ (స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగంలో) ఫలితాల్లో మొత్తం 77.77 మార్కులతో జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించి తన సత్తా చాటాడు. పదో తరగతి వరకు అన్నపురెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో చదివిన పెద్దిరాజు ఇంటర్, డిగ్రీ సత్తుపల్లిలో, ఎంఎస్సీ, బీఈడీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తిచేశారు.

★ 2024 మార్చిలో విడుదలైన గురుకుల ఉపాధ్యాయ ఫలితాల్లో టీజీటీ, పీజీటీలతోపాటు, జేఎల్‌నూ సాధించారు. ప్రస్తుతం ఆయన సత్తుపల్లి గురుకులంలో జేఎల్‌గా పని చేస్తున్నారు. డీఎస్సీలో జిల్లా ప్రథమ ర్యాంకుతో ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించడంతో పెద్దిరాజుకి పలువురు అభినందనలు తెలిపారు.



బొడ్డుపల్లి పెద్దిరాజు

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,000	7,011	6,900
పాతపత్తి	5,000	7,600	7,400
పెసలు	4,000	7,300	7,300
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	12,500	20,000	16,500
ఎండుమిరప	12,000	18,500	17,200
ఏసీ తాలుమిరప	9,500	9,600	9,600

కదం తొక్కిన యువ కళాకారులు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి యువజనోత్సవాలు సోమవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఉత్సాహంగా జరిగాయి. జనవరి 12న జరిగే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనేవారిని ఎంపిక చేసేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వివిధ ప్రాంతాల నుంచి 860 మంది రంగంలోకి దిగారు. ఉదయం నుంచి రాత్రి 7 వరకు యువ నృత్యాలు, గానాలతో వేదిక దద్దరిల్లింది. తొలుత కార్యక్రమాన్ని డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడాశాఖ కళాకారులకు భోజనాలతో పాటు ఇతర సదుపాయాలు కల్పించింది. జానపదం, బృందగానంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ఖమ్మం ప్రథమ, జానపదం నృత్యంలో దివ్య టీజీఆర్‌జేసీ వైరా ప్రథమ, బృంద నృత్యంలో హార్వెస్ట్ జూనియర్ కళాశాల ఖమ్మం ప్రథమ, జానపద గేయాలు సోలోలో వై.మధు ప్రథమ, ఎలక్యూషన్ పోటీలో టి.లక్ష్మీప్రసన్న ప్రథమ, పోస్టర్ డిజైనింగ్‌లో కె.త్రివేణి ప్రథమ, సైన్స్ మేళా విభాగంలో మొత్తం మూడు స్థానాలను ఎస్‌బీఐటీ విద్యార్థుల బృందాలు గెలుచుకున్నాయి. క్రాఫ్ట్ పోటీలో శ్రీన్య ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు డీవైఎస్‌ఓ అందజేశారు. విజేతలంతా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని ప్రకటించారు.





ఆకట్టుకున్న కళాకారిణుల జానపద నృత్య ప్రదర్శనలు.. ఉత్సవాలకు తరలివచ్చిన యువత

EENADU
Classifieds

BUSINESS SERVICES

SAREES

మావద్ద కంచి, ఆరతి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

FINANCIAL SERVICES

తక్కువ వడ్డీతో లోన్స్ * ఇళ్ళ స్థలాలు, పొలాలు, స్కూల్స్ / కాలేజీలు, ఫ్యాక్టరీలు, సొసైటీ ఆస్తులపై / ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ కలవు. బ్యాంకులో ఉన్నా ఇవ్వబడును. నో సిబిల్ & బ్రోకర్స్. M.S.R. గ్రూప్, వైజాగ్. సంప్ర: 7095322311.

REAL ESTATE

HOUSE FOR SALE

ఖమ్మం పట్టణంలో శాంతినగర్, మిషన్ హాస్పిటల్ ఎదురుగా 500 గు॥ విస్తీర్ణంలో, 250 గు॥ ఇల్లు, 250 గు॥ ఖాళీ స్థలంతో అమ్మబడును. Cell No: 7981828101.

PLOT FOR SALE

దసరా ఆఫర్: ఫ్రీ రిజిస్ట్రేషన్, హైదరాబాద్‌లో HMDA & DTCP ప్రాజెక్ట్స్ అన్ని డెవలప్‌మెంట్స్, లోన్స్‌తో విజయవాడ, సాగర్, శ్రీశైలం హైవేలో ప్లాట్లు. Ph: 9154102338

JOBS

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

Wanted Experienced Workers For a Retail Medical Shop at Kothagudem. Good Salary will be paid. Contact: 9392409911.

SECURITY GUARDS

Wanted Security Guards Urgently (Local) Per Month Rs.13500/- Net Wages PF & ESI. 12 Hours Duty, Male, Age: 45 Below. 7569123279, 9840645198.

ప్రకటన చిన్నదైన స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్ B/W
రూ. 435/- మాత్రమే
(GST అదనం)

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి: సీసీఎఫ్

కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డి.భీమానాయక్ అన్నారు. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన భద్రాద్రి జోనల్ స్థాయి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్-24 సోమవారం రాత్రితో ముగిశాయి. ఉదయం జోనల్‌లోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్, కబడ్డీ, చెస్, షటిల్, క్రికెట్ తదితర క్రీడలను నిర్వహించారు. ఓవరాల్ ఛాంపియన్‌గా ఖమ్మం జిల్లా జట్టు నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన సీసీఎఫ్ గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు వేడుకల్లో డీఎఫ్‌వోలు కిష్టాగౌడ్, సిద్దార్థ విక్రమ్‌సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అంజు అగర్వాల్, డీసీఎఫ్‌లు కృష్ణమాచార్య, దామోదర్‌రెడ్డి, ఏసీఎఫ్‌లు సుజాత, సయ్యద్ మక్సుద్ మొహియుద్దీన్, బాబు, చంద్రశేఖర్, మంజుల, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ క్రీడలో తలపడుతున్న మహబూబాబాద్-పాల్వంచ జట్లు



కబడ్డీలో కొత్తగూడెం-భద్రాచలం క్రీడాకారుల నువ్వానేనా..

వేర్వేరు ఘటనల్లో.. 180 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో ఆబ్కారీశాఖ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు రూ.37 లక్షల గంజాయిని సోమవారం పట్టుకున్నారు. ఏఈఎస్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో పట్టణ శివారులో ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బంది నిఘా వేసి.. గంజాయి తరలించే కారును ఆపారు. డ్రైవర్ కారును ఆపకుండా దూసుకెళ్లి పరారయ్యాడు. మార్కెట్ వద్ద కారును గుర్తించిన అధికారులు పట్టణంలో గాలింపు చేపట్టి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు జహీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఫరీద్‌గా గుర్తించారు. ఒడిశా నుంచి ముంబాయికు 130 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు అతడు అంగీకరించాడు. సరకు కొనుగోలు చేయనున్న ముంబయికి చెందిన యూసఫ్ సహీద్‌ఖాన్‌పైనా కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ వెల్లడించారు.

మరో ఘటనలో.. కూనవరం రోడ్డులో తనిఖీలు చేపట్టిన సమయంలో పోలీసులు ఓ ఆటోలో 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఆటో వదిలి పరారైనట్లు ఎస్సై పీవీఎన్.రావు తెలిపారు.

624 కిలోల సరకు దహనం..

ఖానాపురం హవేలి: కమిషనరేట్ పరిధిలో పలు ఠాణాల్లో పట్టుబడిన 624 కిలోల గంజాయిని సీపీ సునీల్‌దత్ నేతృత్వంలో సోమవారం శాస్త్రీయ పద్ధతిలో పోలీసులు దహనం చేశారు. అడిషనల్ డీసీపీ నరేశ్‌కుమార్ పర్యవేక్షణలో మంచుకొండ అటవీ ప్రాంతంలోని పోలీసు ఫైరింగ్ రేంజ్ వద్ద నిర్వీర్యం చేశారు.

యాసంగి విత్తనాలు సిద్ధం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

'యాసంగి' సీజన్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(టీఎస్ సీడ్స్) విత్తనాలను సిద్ధం చేసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని రైతులకు వీటిని అందుబాటులో ఉంచింది. అవసరమైన రైతులు వీటిని కొనుగోలు చేసుకోవచ్చని సీడ్స్ ఉమ్మడి జిల్లా మేనేజర్ భిక్షం తెలిపారు. విత్తనాలను ఖమ్మం జిల్లాలోని 76, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సిద్ధంగా ఉంచుతామని చెప్పారు. కొద్దిరోజుల్లో మినుములు అందుబాటులో ఉంటాయన్నారు. పెసలు, వరి విత్తనాలకు మరికొంత సమయం పడుతుందని తెలిపారు.



ఖమ్మంలోని విత్తన నాణ్యత ప్రయోగ శాల

నిల్వలు (క్వింటాళ్లలో) విత్తన ధర (కిలో రూ.)

మినుములు
పీయూ-31 132.80
టీబీజీ-104 51.04
జీబీజీ-1 13.36
రూ.129.56

సెనగలు
జేజీ-11 0.25
జేఏకేఎల్-9218 0.25
ఎన్‌బీఈజీ-49 0.25
★ రూ.90

కందులు
ఐసీపీఎల్-87119 0.20
149.75

పెసలు
★ రూ.119.73
ఎంజీజీ-295 39.32
ఎంజీజీ-385 23.52

నువ్వులు జేసీఎస్-1020.. 0.10

వరి

బీపీటీ-5204	32.00	41.32
ఎంటీయూ-1061	2,807	39.50
కేఎన్ఎం-1638	85.75	40.20
ఎంటీయూ-1010	66.50	39.80
యూఎంఏ	149.00	--
ఆర్ఎన్ఆర్-15048	17.50	43.76

వేరుసెనగ

గిరినార్-5	కే-6	లేపాక్షి
79.80	0.60	0.50
101.55	101.55	96.55

రైతేరాజు

వరిలో చీడపీడల నియంత్రణ చర్యలు

కొత్తగూడెం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో వరి ముఖ్యమైనది. ఖరీఫ్‌లో అత్యధిక విస్తీర్ణంలో ఈ పంట సాగైంది. ప్రస్తుతం పైరు పొట్ట, ఈనే దశలో ఉంది. ప్రస్తుత వాతావరణంలో ప్రధానంగా చీడపీడల బెడద ఉంది. వీటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ వివరించారు.

- ఎండు తెగులు నివారణకు ఎకరాకు 50 గ్రాముల అగ్రోమైసిన్, 200 ఎం.ఎల్. ప్రొపికోనజోల్ పిచికారి చేయాలి.
- పైరును కాండం తొలుచు పురుగు ఆశిస్తే.. నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు లేదా కొరాజిన్ 60 ఎం.ఎల్.ను 100 లీటర్లలో కలిపి ఎకరాకు స్ప్రే చేయాలి.
- అక్కడక్కడా పొలాల్లో పొటాష్ లోపం కనిపిస్తోంది. దీని నివారణకు 30 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్‌లో కలిపి ఒక ఎకరాకు చల్లాలి. రైతులు సూచనలను పాటిస్తూ మందులను తగిన మోతాదులో మాత్రమే పిచికారీ చేయాలని, లేదంటే కొత్త చీడలతో ఇతర నష్టం సంభవించే అవకాశం ఉందని శాస్త్రవేత్త హెచ్చరించారు.



ప్రశ్న జవాబు

? ప్రస్తుతం దుబ్బు చేసే దశలో వరి పైరు ఆకుల చివరి భాగం నుంచి ఎండుతోంది. నివారణ తెలపగలరు.
కె.రామకోటారెడ్డి, మీనవోలు

◆ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో బ్యాక్టీరియా ఎండుతెగులు వ్యాప్తికి కారణం. నత్రజని ఎరువును తాత్కాలికంగా వేయటం ఆపివేయాలి. పొలం నుంచి నీటిని తీసివేయాలి. ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

? పత్తిలో మొక్కలు అక్కడక్కడా వాడిపోయి ఎండిపోతున్నాయి.
ఎ.నాగేశ్వరరావు, తొండలగోపవరం

◆ పైపాటుగా 30045ఎట్‌దిరేట్ ఆఫ్ 10 గ్రాములు నీటిలో కలిపి రెండు, మూడు రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల చుట్టూ నేల తడిచేలా పోయాలి.

? మినుము సాగు చేసి 15 రోజులైంది. ఆకులపై రంధ్రాలు పడుతున్నాయి.
టి.స్వామి, తొండలగోపవరం

◆ చిత్త పురుగులు ఆశిస్తే ఆకులపై రంధ్రాలు పడతాయి. ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీరు లేదా క్లోరోపైరిపాస్ 2.5 మి.గ్రాముల లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి.

– మధిర, న్యూస్‌టుడే

డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త
మధిర పరిశోధన స్థానం

సమస్యలు పంపాల్సిన వాట్సప్ నెంబరు: 76750 50041

అరటి సాగు.. లాభాలు బాగు



అరటితోటలో రైతు పులిచెర్ల సుబ్బారావు

మధిర, న్యూస్‌టుడే: మధిరకు చెందిన ఓ రైతు దశాబ్దంన్నర కాలంగా అరటి సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. ఏటా మూడెకరాలు కౌలుకు తీసుకొని అరటిలో కర్పూరం, చెక్కరకేళి రకాలు పండిస్తున్నారు. రసాయన ఎరువులను నామమాత్రంగా ఒకదఫా మాత్రమే వాడతారు. పశువుల ఎరువుతోపాటు కోళ్ల ఎరువు, కొన్ని సందర్భాల్లో జీవ రసాయనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. అతడే పులిచెర్ల సుబ్బారావు. అరటి సాగు వివరాలు ఆయన మాటల్లోనే..

'ఎకరా అరటి సాగుకు 900 మొక్కలు నాటాలి. ఒక్కో మొక్కకు రూ.10 ఖర్చు అంటే ఎకరాకు మొక్కలు నాటినందుకు రూ.9వేలు అవసరమవుతాయి. దుక్కులు, వ్యవసాయానికి రూ.10వేలు, ఎరువులకు రూ.15వేలు, గెలలకు ఊతంగా పెట్టేందుకు వాసాలు ఒక్కోదానికి రూ.100 చొప్పున రూ.9వేలు ఖర్చవుతుందన్నారు. పొలం కౌలు, ఇతర యాజమాన్య పద్ధతులు, కూలీలకు మరో రూ.27 వేలు వెరసి మొత్తం రూ.80వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది' అని రైతు తెలిపారు.

దిగుబడి ఇలా..: 'ఎకరాకు 9 వేల మొక్కలు నాటితే 9 వేల గెలలు దిగుబడి వస్తుంది. ఒక్కో గెల రూ.200 నుంచి రూ.250 వరకు పలుకుతుంది. ఎటువంటి రసాయనాలు గెలలపై పిచికారి చేయను. పాకానికి వచ్చిన గెలలను దించి ఇంటి వద్ద కావు వేసి పంట పండిస్తాను. వీటిని కొన్ని సొంతంగా విక్రయించగా మరికొన్నింటిని వ్యాపారస్థులకు అమ్ముతాను. మొత్తమ్మీద ఎకరాకు రూ.1.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఖర్చులు పోగా ఎకరానికి రూ.లక్ష వరకు మిగులుతుంది. ఎంత కష్టపడినా ప్రకృతి సహకరిస్తే ఈ ఆదాయాన్ని తీసుకోవచ్చు. ఏటా అరటి సాగుతో ఎకరాకు రూ.లక్ష చొప్పున మూడెకరాలకు సుమారు రూ.3 లక్షల ఆదాయాన్ని రాబట్టవచ్చు.

(c) eenadu

930 నూతన మీటర్లకు దరఖాస్తుల స్వీకరణ

చంద్రుగొండ, న్యూస్‌టుడే: బీపీఎస్ స్కీం కింద నాలుగు మండలాల్లో 930 నూతన విద్యుత్తు మీటర్లకు దరఖాస్తులు స్వీకరించినట్లు కొత్తగూడెం రూరల్ ఏడీఈ యాసిన్ తెలిపారు. చంద్రుగొండలోని విద్యుత్తు ఉపకేంద్రం కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం వరకు వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. చంద్రుగొండ 285, అన్నపురెడ్డిపల్లి 180, జూలూరుపాడు 245, సుజాత్‌నగర్ 220 కొత్త విద్యుత్తు మీటర్ల దరఖాస్తు వచ్చాయన్నారు. చంద్రుగొండ మండలంలోని గుర్రాయిగూడెం, పోకలగూడెం, తుంగారం పంచాయతీలు ప్రధానమంత్రి జుగల్ స్కీం కింద ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ మూడు పంచాయతీల్లో కొత్త విద్యుత్తు మీటర్లు, కొత్త లైన్లు, విద్యుత్తు నియంత్రికలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

గుండాల, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండలాధ్యక్షులు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంభునిగూడెం ఆశ్రమపాఠశాలలో సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్సీ ప్రకటించాలన్నారు. నాయకులు బాలు, రామచంద్రయ్య, సంపత్, బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: వెంకటాపురం పంచాయతీ మామిళ్లవాయి గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. పాములు తిరుగుతున్నాయి. సోమవారం రాత్రి దొరువు 9 అడుగుల పాము ప్రత్యక్షమైంది. - కురసం వసంత్

సమాధానం: పరిశీలించి వీధిదీపాలు వేస్తాం.
- ప్రతాప్ రాణా, పంచాయతీ కార్యదర్శి
- అశ్వాపురం, న్యూస్‌టుడే

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: పాయం



కరకగూడెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కరకగూడెం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చిరుమల్ల, వట్టంవారిగుంపు, కరకగూడెం, గాంధీనగర్‌లో రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం ఆయన ప్రారంభించారు. రూ.1.64 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న చొప్పాల పంచాయతీ అల్లేరుగూడెం-శ్రీరంగాపురం బీటీ రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. చిరుమల్ల, వట్టంవారిగుంపులో రూ.40 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాలను ప్రారంభించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. చిరుమల్ల ఆశ్రమ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించారు. రుచికరమైన భోజనం ఎందుకు అందించడం లేదని వార్డెన్‌ను హెచ్చరించారు.

రైలు సర్వీసులు పునరుద్ధరించాలని వినతి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: రద్దు చేసిన రైలు సర్వీసులు పునరుద్ధరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మణుగూరు రైల్వే స్టేషన్ మాస్టర్ శుభోధ్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ... మణుగూరు నుంచి పలు సర్వీసులను కరోనా కారణంతో రద్దు చేశారని తెలిపారు. ప్రస్తుతం నడిచే రైళ్లను నిర్ణీత సమయానికి నడిచేలా చూడాలన్నారు. సింగరేణి, విజయవాడ రైళ్లను మణుగూరు వరకు పొడిగించాలన్నారు. రాంనర్సయ్య, నాగరాజు, సురేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఐటీడీఏ దర్బారులో.. గిరిజనుల గోడు..!

భద్రాచలం, న్యూస్‌టుడే



దర్బారులో సమస్యలు వింటున్న పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలం మన్యంలోని గిరిజనులకు సంక్షేమ పథకాలను సకాలంలే చేరవేసి వారి వికాసానికి కృషి చేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఎస్డీసీ రవీంద్రనాథ్, డీడీ రమాదేవి, ఆర్సీఓ నాగార్జునరావు, ఈఈ తానాజీ, యూనిట్ అధికారులతో కలిసి సోమవారం తన కార్యాలయంలో దర్బారు నిర్వహించారు. గిరిజనుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తడంతో వాటిని పరిశీలించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపారు. ఉద్యోగాల కోసం దర్బారులో దరఖాస్తులు ఇవ్వవద్దని, ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనల ఆధారంగానే ఉద్యోగాల కల్పన ఉంటుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా జీవనోపాధిని పెంపొందించేందుకు దర్బారును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

రుణం ఇప్పించండి..



నాది అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర. అనారోగ్యంతో కర్ర సాయం లేనిదే నడవలేక పోతున్నాను. ఉపాధి కోసం రుణ సాయం చేయాలని కోరుతున్నా. ట్రైకార్‌గానీ ఇతర ఏ పథకం ద్వారానైనా ఆర్థిక సాయం చేస్తే కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. అధికారులు పెద్ద మనసుతో మా గోడు ఆలకించాలి. - కె.సత్యనారాయణ

భూమి ఉంది గానీ..



మాది ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామం. మా భూమికి సంబంధించిన అన్ని హక్కులు కలిగి ఉన్నాం. పట్టాలు ఉన్నాయి. రైతుబంధు వస్తోంది. రుణమాఫీ వర్తిస్తుంది. మా భూమిని ఓ రైతు ఆక్రమించుకోవడంతో మేం సాగు చేయలేకపోతున్నాం. ఈ భూమి ఎక్కడ ఉందో తెలిసినప్పటికీ దీన్ని ఇప్పటి వరకు అధికారులు చూపించలేదు. పట్టాలు ఉన్నప్పటికీ కూలీలుగానే బతకాల్సి వస్తోంది. పలుమార్లు అధికారులకు వినతులు ఇస్తూనే ఉన్నాం. ఇప్పటికైనా మా పొలాలను మాకిప్పించండి సారూ..! – గనప పాపారావు, సంగం శ్రీను

ఆరో తరగతి అనుకుంటే.. ఐదులో చేర్చుకున్నారు



నాది ఇల్లెందు మండలం ధర్మా తండా. నా కుమార్తె పుష్పశ్రీ 5వ తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత 6వ తరగతిలో సీటు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఆన్‌లైన్‌లో తప్పు దొర్లడంతో మళ్లీ ఐదో తరగతి చదవాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో 6వ తరగతి ప్రవేశానికి బదులు 5వ తరగతి అని దరఖాస్తు చేయడంతో ఈ పరిస్థితి వచ్చిందని అంటున్నారు. పరిశీలించి ఆరో తరగతిలో ప్రవేశం కల్పించాలి. - బి.రవి



జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

'ముంపు కాలనీలకు పరిష్కారం చూపండి'

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో ముంపు కాలనీలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంబీ కాలనీలో సోమవారం నిర్వహించిన శాఖ మహాసభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడారు. పట్టణంలో వరద ముంపు ఉన్న కాలనీలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, జ్యోతి, లీలావతి, రామారావు, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

అచ్చయ్యకు 23వ ర్యాంకు



అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన కల్లోజి అచ్చయ్య స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో మొత్తం 65.90 మార్కులతో జిల్లా 23వ ర్యాంకు సాధించారు. ఎస్సీ కేటగిరీలో ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

గారపాటి మకాంకు దారి నిర్మించండి సారూ..!



అశ్వారావుపేట శివారు పేటమాలపల్లి నుంచి గారపాటి మకాంకు వెళ్లే మార్గం పక్కా రోడ్డు నిర్మించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిత్యం ఈ మార్గంలో వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు తిరుగుతుంటాయి. ఎక్కువగా ఆయిల్‌పాం గెలలతో ట్రాక్టర్లు నిత్యం తిరుగుతుండటం, దారి సక్రమంగా లేకపోవడంతో వచ్చే పోయే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. పంచాయతీ రాజ్ డీఈఈ శ్రీధర్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రైతుల విజ్ఞప్తి మేరకు తారు రోడ్డుకు సర్వేచేసి ప్రతిపాదన పంపనున్నట్లు తెలిపారు.

– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

ప్రారంభించకుండానే.. శిథిలావస్థకు..!



చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో పశువులకు వైద్యసేవలు అందించేందుకు నిర్మించిన గోపాలమిత్ర భవనం ఇది. పదేళ్ల కిందట రూ.7లక్షల వ్యయంతో నిర్మించారు. విద్యుత్తు, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయలేదు. అనంతరం భవనం గురించి పట్టించుకునే వారే కరవయ్యారు. దీంతో భవనం నిరుపయోగంగా మిగిలింది. ఇప్పటికైనా పశు సంవర్ధక శాఖాధికారులు పట్టించుకుని తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాల్సి ఉంది. ఈ పరిస్థితిపై పశువైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

– చంద్రుగొండ, న్యూస్‌టుడే

మహిళకు శస్త్రచికిత్స చేసిన ఎమ్మెల్యే

15 కిలోల కణితి తొలగింపు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ మహిళకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం శస్త్రచికిత్స చేసి కడుపులోని 15 కిలోల నీటి కణితిని తొలగించారు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం జగ్గవరం గ్రామానికి చెందిన మహిళ(51) కొంత కాలంగా కడుపు నొప్పితో తీవ్రంగా బాధపడుతూ భద్రాచలం ప్రైవేటు ఆసుపత్రికి వచ్చారు. వైద్యులు ఆమె స్కానింగ్ పరీక్ష నిర్వహించి గడ్డ ఉన్నట్లు నిర్ధారించారు. ఆమెకు శస్త్రచికిత్స చేసిన ఎమ్మెల్యే ఆమె కడుపులోని గడ్డను తొలగించారు.

జీసీసీ ఇన్‌ఛార్జి డివిజనల్ మేనేజర్‌గా సమ్మయ్య



బాధ్యతలు స్వీకరించిన పి.సమ్మయ్య

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం గిరిజన సహకార సంస్థ ఇన్‌ఛార్జి డివిజనల్ మేనేజర్‌గా పొడిపె సమ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట జీసీసీలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భద్రాచలం జీసీసీ డీఎం దావీదు సోమవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను సమ్మయ్యకు అప్పగించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దవాగు ప్రాజెక్టు గ్రామంలో గల గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అధ్యాపకురాళ్లు, విద్యార్థినులతో కలసి పాటలు పాడుతూ బతుకమ్మలాడారు. కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

'ఈడీ దాడులు కక్షపూరితమే'

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసాలపై ఈడీ దాడులు కక్ష పూరితమే అని మండల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సోమవారం అన్నపురెడ్డిపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భాజపా, భారాస లోపాయికారీ ఒప్పందంతోనే ఈ దాడులు జరిగాయని, ప్రతిపక్ష నాయకులపై భాజపా దాడులు సరికాదన్నారు. పర్సా వెంకటేశ్వరరావు, వేముల రమణ, మల్లెల నరసింహరావు, రాము, శివ, లక్ష్మారెడ్డి, నాగేశ్వరరావు, పూర్ణ పాల్గొన్నారు.

రేపు ఆయిల్‌పాం గ్రోయర్స్ కమిటీ సమావేశం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: తెలంగాణ ఆయిల్‌పాం అశ్వారావుపేట జోన్ గ్రోయర్స్ కమిటీ సమావేశం అక్టోబరు 2న ఉదయం 10 గంటలకు అశ్వారావుపేటలోని గిరిజన భవన్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరి ఉమామహేశ్వరరెడ్డి, కె.పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ కమిటీ ఏర్పాటై రెండేళ్లయిన సందర్భంగా నిర్వహించనున్న సమావేశానికి ఆయిల్‌పాం రైతులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

జీసీసీ డీఎం దావీద్‌కు సన్మానం

భద్రాచలం, న్యూస్‌టుడే: ప్రతి ఉద్యోగికి తన పదవీ కాలంలో చేసిన పనులే గుర్తింపు తెస్తాయని ఐటీడీఏ పీఓ రాహుల్ వెల్లడించారు. జీసీసీ డీఎం దావీద్ ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఐటీడీఏలో ఆయనను సన్మానించారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెప్పారు. యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ. 2.50 లక్షలు వితరణ



భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: గోదావరి నది స్నానఘట్టాల కరకట్ట వద్ద కొలువై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.2.50 లక్షల విరాళాన్ని దాతలు అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకమేడల రామకోటేశ్వరరావు రూ.2,00,116, సాగర్ రూ.50,116 అందజేసినట్లు అర్చకులు సుబ్రమణ్యం వెల్లడించారు.

దివ్యాంగులకు బస్ పాస్‌లు..

దుమ్ముగూడెం: మండలపరిషత్తు కార్యాలయం ఆవరణలో దివ్యాంగులకు ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం బస్ పాస్ శిబిరం నిర్వహించారు. 46 మంది దివ్యాంగులకు బస్ పాస్‌లు జారీ చేశారు.

ఏరియాలో 63 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు ఏరియాలో సెప్టెంబరులో 63శాతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినట్లు ప్రధాన అధికారి దుర్గం రామచందర్ తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. 8,76,500కి గాను 5,53,678 టన్నుల బొగ్గును వెలికి తీసినట్లు తెలిపారు. 5,59,157 టన్నుల బొగ్గు రవాణా చేశామన్నారు. ప్రత్యేకాధికారి శ్యామసుందర్, వెంకటేశ్వర్లు, వీరభద్రరావు, లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సంఘాల సహకారం కీలకం'

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: విద్యా సంబంధ అంశాల్లో ఉపాధ్యాయ సంఘాల సహకారం విద్యాభివృద్ధికి సోపానం అవుతుందని ఎంఈఓ పి.ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో నిర్వహించే విద్య, సాంస్కృతిక, క్రీడలు, ప్రభుత్వ పథకాల అమలులో ఉపాధ్యాయ సంఘాలు క్రియాశీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఎం.కృష్ణారావు, హెచ్.హరిబాబు, మాధవరెడ్డి, ఎస్.నాగేశ్వరరావు, సీతారాములు, లక్ష్మీనర్సు, పి.రాము పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గుండాల, న్యూస్‌టుడే: గుండాల విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతులతో మండలంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రమేష్‌బాబు తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి: జారే



ములకలపల్లిలో బతుకమ్మతో ఎమ్మెల్యే జారే

ములకలపల్లి, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. ములకలపల్లి మండలంలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. అంకిత మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో నర్సాపురం, సుబ్బనపల్లి, జగన్నాథపురం, పాతూరు, ములకలపల్లి గ్రామాల్లోని మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన పెరటి కోళ్లు, పుట్టగొడుగుల పెంపకం, కుట్టమిషన్ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. మహిళలతో కలసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం రూ. 5కోట్ల బ్యాంకు లింకేజి చెక్కును సభ్యులకు అందజేశారు. డీపీఎం సునందన్, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ మహాలక్ష్మి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

'ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి'



వినతిపత్రాలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు విద్యాచందన, చిత్రంలో డి.వేణుగోపాల్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేసిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) డి.వేణుగోపాల్ ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు విద్యాచందనతో కలిసి వినతిపత్రాలు స్వీకరించారు. బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో గిరిజనులతోపాటు అన్ని కులాలకు చెందిన వంద కుటుంబాలవారం నివాసం ఉంటున్నామని, తమకు విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నందున సమస్యను పరిష్కరించాలని స్థానికులు వినతిపత్రం అందించారు.

'తాగునీటి సహాయకులు అప్రమత్తంగా ఉండాలి'



శిక్షణ కార్యక్రమంలో ఎస్ఈ సదాశివకుమార్, సిబ్బంది

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేసే సహాయకులు అప్రమత్తంగా ఉండాలని మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్ అన్నారు. అశ్వారావుపేటలో జరుగుతున్న సహాయకుల శిక్షణ శిబిరానికి సోమవారం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కేవలం నీళ్లు వదలడమే కాదు, మోటార్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? విద్యుత్తు ఓల్టేజీ సక్రమంగా ఉందా? తీగలు ఎక్కడైనా తెగి ప్రమాదాలకు అవకాశం ఉందా? అన్నది ఎప్పటికప్పుడు గమనించి అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని సూచించారు. డీఈఈ సలీం, ఏఈఈ లక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి చాటాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని చాటాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆర్లగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడల ఎంపికలు సోమవారంతో ముగిశాయి. ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్ మాట్లాడుతూ జోనల్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. వసంతం, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

దమ్మపేట: మండలంలోని పార్కెలగండి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న దమ్మపేట జోన్ స్థాయి ఆశ్రమ పాఠశాలల క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. రెండోరోజు బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి, అన్నపరెడ్డిపల్లి మండలాల నుంచి 102మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని కన్వీనర్ రవికుమార్ తెలిపారు.

అశ్వాపురం, న్యూస్‌టుడే: గొందిగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఐటీడీఏ డివిజనల్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు సోమవారం ముగిశాయి. భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, ఉప్పుసాక, కరకగూడెం ఆశ్రమ పాఠశాలల బాల బాలికలు పలు క్రీడాంశాల్లో ప్రతిభచూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

జీఎస్పీ ఆధ్వర్యంలో దీక్ష

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: న్యాయ కళాశాల మంజూరుతో పాటు వివిధ 12 రకాల సమస్యలపై భద్రాచలం ఐటీడీఏ ఎదుట గోండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులు సోమవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సోందే వీరయ్య, అధ్యక్షుడు పాయం సత్యనారాయణ ప్రసంగించారు. పీఓ పరిధిలోని సమస్యలూ పరిష్కారం కాకపోవడం శోచనీయమన్నారు. దీక్షకు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకురాలు కెచ్చల కల్పన మద్దతు తెలిపారు. సుబ్బయ్య, సన్యాసి, పార్వతి, సీతక్క, కాంతమ్మ, చిన్నయ్య, తులసి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ఇద్దరి కొలువులు ఒక్కరికేనా..?

భద్రాచలం, న్యూస్‌టుడే



భద్రాచలం రామాలయంలో కొద్ది రోజులుగా ఓ విచిత్ర పరిస్థితి నెలకొంది. రెండేసి కీలక హోదాలను ఒక్కరికే అప్పగిస్తుండడంతో ఈ ప్రభావం భక్తులపై ప్రత్యక్షంగానో పరోక్షంగానో పడుతోంది. ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్‌ను నాలుగున్నర నెలల కిందట సస్పెండ్ చేశారు. జానకీ సదనానికి భక్తులు ఇచ్చిన విరాళాలను సొంతానికి ఉపయోగించారనే కారణంతో అతని క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇదే క్రమంలో ఆయన చూడాల్సిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి బాధ్యతలను మరో ఏఈఓ భవానిరామకృష్ణారావుకు అప్పగించారు. గతంలో ఒకరు ఆలయ విధులు చూడగా.. ఇంకొకరు కార్యాలయ బాధ్యతలను పరిశీలించేవారు. ఇప్పుడు ఈ రెండూ ఒక్కరే చూడాల్సి వస్తోంది.

★ దసరా మహోత్సవాలలో భాగంగా ఈనెల 3 నుంచి రామాయణ పారాయణం ప్రారంభమవుతుంది. 4 నుంచి 12 వరకు అవతారాల దర్శనం ఉంటుంది. ఇలాంటి వేడుకల వేళ ఒక ఏఈఓ రెండు బాధ్యతలను పర్యవేక్షించాలంటే పనిభారం తప్పదు. సీనియర్ సూపరింటెండెంట్లలో ఒకరికి తాత్కాలింగా ఇన్‌ఛార్జి ఏఈఓగా బాధ్యతలు అప్పగిస్తే ఇబ్బంది ఉండదని పలువురు సూచిస్తున్నారు.

ప్రధానార్చకుడు ఒక్కరే..

రామాలయంలో ఇద్దరు ప్రధానార్చకులు పనిచేయాల్సి ఉన్నా ప్రస్తుతం విజయరాఘవన్ ఒక్కరే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరో ప్రధానార్చకుడు సీతారామానుజాచార్యులు తనపై ఉన్న లైంగిక వేధింపుల కేసును గోప్యంగా ఉంచడంతో ఇటీవల సస్పెండయ్యారు. ఆయన పర్యవేక్షించే బాధ్యతలనూ ప్రధానార్చకుడు విజయరాఘవన్ అదనంగా చూస్తున్నారు. ఉప ప్రధానార్చకుల్లో సీనియర్‌కు ఈ బాధ్యతలను తాత్కాలికంగా అప్పగిస్తే ఉత్సవాల సమయంలో పని ఒత్తిడి లేకుండా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇదే క్రమంలో ఈ వేడుకలను పురస్కరించుకుని కొంత మంది వైదిక సిబ్బందిని తాత్కాలి పద్ధతిలో తీసుకుంటున్నారు. ఇందులోను పారదర్శకత పాటించాలని కోరుతున్నారు.

బస్సులోంచి జారిపడి మహిళకు గాయాలు

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు దిగుతుండగా జారిపడిన మహిళకు గాయాలయ్యాయి. నడిమిగూడెం గ్రామానికి చెందిన పాయం లక్ష్మి సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సెక్కారు. పాతూరు బస్‌స్టాప్ వద్ద ఆమె దిగాల్సి ఉంది. స్టేజీ వద్ద బస్సు ఆగలేదన్న కంగారులో ఒక్కసారిగా ఫుట్‌పాత్ నుంచి దిగబోయింది. ఆ సమయంలో అదుపుతప్పి కిందపడటంతో తల, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితురాలిని '108' సిబ్బంది ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సదరు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నడిమిగూడెం వాసులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వారు డ్రైవర్‌ను ఠాణా వద్ద ఆపారు. జరిగిందేమిటో అడిగి తెలుసుని పంపించేశారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నారాయణపురం సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. అశ్వారావుపేట శివారులో నిఘా పెట్టిన అధికారులు ఇసుకతో వస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్‌చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ఐ కృష్ణ తెలిపారు.

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోకి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గిర్దావర్ నర్సింహారావు పట్టుకొని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తోలకాలు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దారు శ్రీనివాస్ హెచ్చరించారు.







(c) eenadu

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరికీ మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పేర్కొన్నారు. సోమవారం పాల్వంచ మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎన్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు అందించిన కంప్యూటర్‌లను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ టీఎన్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు ఆమెరికాలో ఉన్న పుట్టిన ప్రాంతంపై మమకారంతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరాచారి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం మైదానంలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన సింగరేణి మహిళా కళాశాల విద్యార్థులను సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ సోమవారం అభినందించారు. సొసైటీ కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: ఇటీవల ఎంజీరోడ్ నుంచి చిన్నబజార్‌కి సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్డుపై క్యూరింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన మట్టికుప్పలు పోశారు. వాటిని ఇప్పటి వరకు తొలగించలేదు. **- స్థానికులు**

సమాధానం: సత్వరంగా ఆ పనులు చేపట్టే విధంగా సూచనలు చేస్తాం. రోడ్డుకు అడ్డంగా వేసిన చెత్తను తొలగిస్తాం.

- వీరభద్రాచారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

- కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

పాల్వంచ పట్టణం శ్రీనివాసకాలనీలో డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో మురుగు దుర్వాసనతోపాటు పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. **- రవి, స్థానికుడు**

✔ సంబంధిత ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం. **- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి. - పాల్వంచ, న్యూస్‌టుడే**

రెండో రోజు కొనసాగిన క్రీడా ఎంపికలు



లాంగ్ జంప్ ఎంపికలను నిర్వహిస్తున్న పీడీలు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పాల్వంచ డివిజన్ స్థాయి గిరిజన క్రీడల ఎంపికలు రెండో రోజు సోమవారం నిర్వహించినట్లు క్రీడల అధికారి బి.గోపాలరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది క్రీడాంశాల్లో సోమవారం జరిగిన ఎంపికల్లో 110 మంది విద్యార్థులను డివిజన్ స్థాయికు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపికల్లో ఏఎస్‌వో వెంకటనారాయణ, ప్రధానోపాధ్యాయులు రామారావు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ క్రీడలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల జోనల్ క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో అండర్ 14, 17 విభాగాల్లో బాలికలకు ఆదివారం, బాలురకు సోమవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. మొత్తం 455 మంది తలపడగా 120 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రహదారికి మరమ్మతులు

టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి నుంచి ఏ కాలనీతండా మీదుగా పెగళ్లపాడు వెళ్లే బీటీ రహదారి వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. వాహనదారుల విన్నపంతో ఎంపీడీవో జి.రవీందర్‌రావు స్పందించి పంచాయతీ కార్యదర్శి దీప్తితో మాట్లాడారు. ఆయన ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికులు గుంతలను సోమవారం పూడ్చేశారు.

జిహ్వాచాపల్యం తగ్గిస్తే.. ఆరోగ్యం పెరుగున్

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. అదేలాగ అంటారా? శాకాహారం భజించడంతో అంటున్నారు.. అనుభవజ్ఞులు. నేటి ఉరుకులు.. పరుగుల జీవితంలో తిన్న ఆహారం సంపూర్ణంగా జీర్ణమై ఆరోగ్యంగా ఉండాలంటే మిత ఆహారం శ్రేయస్కరం. మాంసాహారాన్ని తగ్గించుకొని శాకాహారం వైపు మళ్లితే మన శరీరాన్ని మనం మలుచుకొనే అవకాశం ఉంటుంది. నేడు శాకాహార దినోత్సవం సందర్భంగా శాకాహారుల మనోభావాలతో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– చుంచుపల్లి, న్యూస్‌టుడే

25 ఏళ్లుగా సాత్వికాహారమే

బొలిశెట్టి శివరామకృష్ణ, సింగరేణి విశ్రాంత ఉద్యోగి, విద్యానగర్



సింగరేణి సంస్థలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పని చేసి 2009లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశాను. 25 ఏళ్లుగా నేను నా భార్య సత్యావతి శాకాహారాన్నే తీసుకుంటున్నాం. గతంలో మాంసాహారులమే. సత్యసాయి భక్తులుగా, ఆరోగ్య రీత్యా మాంసాహారాన్ని మానేశాం. దీంతోపాటు నిత్యం చిన్నచిన్న యోగాసనాలు ఇంట్లోనే చేస్తూ అత్యధిక సమయాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాను. మిత ఆహారం, శాకాహారం, నిత్య ఆరోగ్య సూత్రాలతో తనకు 69 సంవత్సరాలు వచ్చిన రక్తపోటు, మధుమేహం వంటి ఎలాంటి అనారోగ్య సమస్యలు నేటికి లేవని తెలిపాడు. శాకాహారం వలన ప్రశాంత జీవితంతోపాటు శరీరం ఆరోగ్యంగా ఉండి, మెదడు చురుగ్గా పని చేస్తుంది. మా పిల్లలు, మా బంధువులు ఎవరు వచ్చినా వారికి మా ఇంట్లో మాంసాహారం చేయం. బయటకు వెళ్లి వారు తినిరావాల్సిందే.


ఆరోగ్యం పదిలం: సందెబోయిన నారాయణ, విశ్రాంత సింగరేణి ఉద్యోగి, చుంచుపల్లి



సింగరేణి సంస్థలో క్లర్క్‌గా పని చేసి 2014లో పదవీ విరమణ పొందాను. నేను, నా భార్య విజయలక్ష్మి మాంసాహారాన్ని వద్దనుకొని 20 ఏళ్ల నుంచి శాకాహారాన్నే భుజిస్తున్నాం. మొదట మాంసాహారి అయినా శాకాహారంలోకి మారడంతో ఆరోగ్యపరంగా ఎన్నో లాభాలు పొందాను. 70 ఏళ్లు వచ్చినా నేటికి తనకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవు. ఉదయం లేచి యోగా, నడకను తప్పక పాటిస్తా. సాత్విక ఆహారంతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండి రోజంతా ఉత్సాహంగా ఉంటాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం కూరగాయాలు, ఆకుకూరలతో భోజనం, రాత్రి పండ్లు, స్వల్ప ఆహారాన్నే భుజిస్తాం. శాకాహారంతో గుండెపోటు, రక్తపోటు, కొలెస్ట్రల్ తదితర రుగ్మతలు దూరమవుతాయి. జీర్ణశక్తి బాగా ఉంటుంది. బరువు అదుపులో ఉండి ఏ పనిచేసినా అలసట రాదు.


మొకాళ్ల నొప్పులు, బీపీని తగ్గించుకొన్నాను

బత్తుల కృష్ణయ్య, విశ్రాంత ప్రధానాచార్యుడు, కొత్తగూడెం



నా వయస్సు 78 ఏళ్లు. 40 ఏళ్ల క్రితం నుంచి మాంసాహారాన్ని వదిలేసి శాకాహారిగా మారాను. మొదట నాకు స్వల్పంగా మొకాళ్ల నొప్పులు, బీపీ వచ్చింది. శాకాహారం, ఇంటిలో పాటించే ప్రకృతి వైద్య చికిత్సలతోనే వాటిని దూరం చేశాను. రోజు ఉదయాన్నే లేచి నడక, యోగాసనాలు చేస్తాను. అల్పాహారంగా జామ, నారింజ తదితర సీజనల్ పండ్లు, డ్రై ఫ్రూట్స్‌ను ఉదయాన్నే తీసుకుంటాను. మధ్యాహ్నం కూరగాయలు, ఆకు కూరలతోనే భోజనం. రాత్రి జావ, పండ్లు తీసుకొంటాను. ఇంత వయస్సు వచ్చినా నాకు ప్రస్తుతం ఎటువంటి రుగ్మతలు లేవు. నిత్యం సమాజ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతాను. నేటి తరం యువత మాంసాహారం, సమయపాలనలేని భోజనాలు, కనీస వ్యాయామం లేకుండా తమ ఆరోగ్యాలను తాము పాడు చేసుకొంటున్నారు. పాశ్చాత్య పోకడలతో అనారోగ్యాలను కొని తెచ్చుకొంటున్నారన్నారు.

శాఖాహారంతో ఎలాంటి రుగ్మతలు దరిచేరలేదు : నాగా సీతారాములు, టీపీసీసీ సభ్యుడు, సుజాతనగర్



20 ఏళ్ల క్రితం యోగాకు వెళ్లినా సమయంలో శాకాహారమే భుజించాలని నిర్ణయం తీసుకొన్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు శాకాహారమే తీసుకొంటున్నాను. నా వయస్సు ప్రస్తుతం 50 ఏళ్లు అయినా నేటికి ఎటువంటి రుగ్మతలు లేవు. ఉదయాన్నే లేచి యోగా, షటిల్ ఆడుతాను. రాజకీయపరంగా నిత్యం ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ ఎటువంటి అలసట లేకుండా ఉత్సాహంగానే ఉంటాను. మాంసాహారాన్ని దూరం పెడటంతో జీర్ణవ్యవస్థ సవ్యంగా పని చేస్తోంది మెదడు చురుగ్గా ఉండి, ఎటువంటి ఒత్తిడినైనా తట్టుకొంటూ అనారోగ్యం అనేది దరిచేరదు.

ఉద్యోగ విరమణ సన్మానాలు



ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న ప్రాజెక్టు అధికారి శ్రీరమేష్ తదితరులు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఉద్యోగులను సోమవారం సన్మానించారు. ప్రాజెక్ట్స్, ప్లానింగ్ జీఎం రమేష్‌కుమార్ ఉద్యోగ విరమణ చేయగా ప్రధాన కార్యాలయంలో ఆయన్ను డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, ఇతర జీఎంలు, అధికారులు సన్మానించారు.

✦ జీకే ఉపరితల గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న వాసిరెడ్డి ప్రసాద్ ఉద్యోగ విరమణ చేయగా సోమవారం గని ఆవరణలో ఆయన్ను సన్మానించారు. ప్రాజెక్టు అధికారి శ్రీరమేష్ ఆధ్వర్యంలో ప్రసాద్ దంపతులను సన్మానించారు.

✦ సివిల్ విభాగంలో విధులు నిర్వహించిన రమణమూర్తి సోమవారం ఉద్యోగ విరమణ చేయగా జీఎం సివిల్ సూర్యనారాయణతో పాటు పలువురు ప్రముఖులు ఆయన్ను సన్మానించారు. సన్మానించిన వారిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వంగా వెంకట్, మల్లికార్జున్‌రావు, మద్దెల శివకుమార్ తదితరులు సన్మానించారు.

మంత్రి పొంగులేటిని కలిసిన 'ఎన్‌హెచ్ 930పీ' బాధితులు

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్ 930పీ నిర్మాణంలో భాగంగా బోడు రోడ్డు వద్ద హైజంక్షన్ విస్తరణతో ఇళ్లు కోల్పోనున్న బాధితులు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో కలుసుకున్నారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్‌హెచ్‌కు సంబంధంలేని బోడురోడ్డులో 11 ఇళ్లు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. నాయకులు కోరం సురేందర్, సంజయ్, మధురెడ్డి, పోశాలు, సర్దార్, నిర్వాసితులు పాల్గొన్నారు.

పురపాలక అత్యవసర సర్వసభ్య సమావేశం

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక అత్యవసర సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ కె.సీతాలక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ప్రధానంగా మూడు అంశాలపై చర్చించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా వార్డు నెంబర్ 3, కొత్తగూడెం గోధుమవాగు బతుకమ్మ ఘాట్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేయడానికి రూ.5.94 లక్షలను పురపాలక సాధారణ, 15వ ఫైనాన్స్ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. పురపాలకంలోని 36 వార్డుల్లో బతుకమ్మ పండుగ ఏర్పాట్లకు రూ.8.91 లక్షలు, దీపావళి పండుగ సందర్భంగా శ్మశాన వాటికలను శుభ్రం చేయడానికి రూ.1.98 లక్షలను సాధారణ, ఫైనాన్స్ నిధుల నుంచి ఖర్చు చేయాలనే అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, పురపాలక కమిషనర్ శేషు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రాజశేఖర్‌ను అభినందించిన డైరెక్టర్

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: మొక్కలను నాటుతూ ప్రధాని ప్రశంసలను అందుకున్న మొక్కల రాజశేఖర్‌ను డైరెక్టర్(ఈఎం) సత్యనారాయణ రావు సోమవారం ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. సింగరేణి ఉద్యోగిగా పర్యావరణానికి రాజశేఖర్ చేస్తున్న సేవలను డైరెక్టర్ అభినందించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మెరుగైన వైద్య సేవలందించాలని ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎం జాన్ ఆనంద్ అన్నారు. జేకే కాలనీ డిస్పెన్సరీని సోమవారం జీఎం ఆకస్మికంగా సందర్శించారు. డీజీఎం(పర్సనల్) జీవీ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో దీర్ఘకాలిక రుణాలివ్వాలి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: సహకార సంఘం ద్వారానే దీర్ఘకాలిక రుణాలు సైతం ఇవ్వాలని, పోడు పట్టాలు ఉన్న రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని, రుణమాఫీ పొందిన రైతుల్లో ఇతర బ్యాంకుల్లో రుణాలు ఉన్నా సొసైటీ ద్వారా మరో సర్వే నంబర్‌పై రుణాలివ్వాలని సర్వజన మహాసభలో సభ్యులు తీర్మానించారు. జూలూరుపాడు సొసైటీ సర్వజన మహాసభ సోమవారం నిర్వహించారు. డైరెక్టర్లు సత్యనారాయణ, పాండురంగారావు, హేమ్లా, తిరువెంగళరాజు, రాము, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్వంచ పీఏసీఎస్ రైతు సంక్షేమానికి కృషి చేస్తోందని సొసైటీ నుంచి రుణాలు పొందిన 591 మంది రైతులకు రూ.1.77 కోట్ల రుణమాఫీ అయిందని డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. సొసైటీ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేశ్, ఏవో శంకర్, డీసీసీబీ సూపర్‌వైజర్ సురేశ్, డైరెక్టర్లు రాంమ్మోహన్‌రావు, కనగాల అనంతరాములు, పాపారావు, జనార్దన్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ అన్నారు. జిల్లా స్థాయి రోల్ ప్లే పోటీలను పాతకొత్తగూడెం ఆనందఖని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన పెరుగుదల, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిరక్షణ, ఇంటర్నెట్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం, వ్యసనాలకు బానిస కాకుండా ఉండటం అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టేకులపల్లి మండలం సులానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలిచినట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల విజేతలకు నగదు బహుమతి అందజేశారు.

కలెక్టరేట్ ఎదుట మహిళలు ధర్నా

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పేద ముస్లింలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ 'సేవ్ కొత్తగూడెం-సేవ్ మున్సిపాలిటీ' ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం కన్వీనర్ మహ్మద్ జలాల్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు నియోజకవర్గాలకు చెందిన 400 మంది నిరుపేద ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు మంజూరు చేసిందని, అవి వచ్చినా వాటిని ఈ ప్రభుత్వం పంపిణీ చేయకుండా ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. గత 8 నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు స్పందించి, జిల్లాకు మంజూరైన కుట్టుమిషన్లను వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావును కలిసి వినతిపత్రం అందించారు.

తాజా పూలు.. ధర కూడా మేలు!

పూల పండగ బతుకమ్మ రానే వచ్చింది. మరో వైపు దసరా సరదాలు మోసుకొస్తోంది. ఈ వేడుకలను మరింత శోభితం చేసేందుకు అవసరమైన బంతిపూలకు గిరాకీ పెరిగింది. అందుకే రైతులు తమ తోటల వద్దనే పూలు విక్రయిస్తున్నారు. ప్రధాన రహదారుల పక్కనే వీటిని ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఆగి మరీ కొనుగోలు చేస్తున్నారు. తోటల వద్దనే కిలో బంతిపూలు రూ.100 పలుకుతోంది. బతుకమ్మ వేడుకలతో ప్రారంభమై సంక్రాంతి, అయ్యప్పల దీక్ష వరకు ఈ పూలకు బాగానే డిమాండ్ ఉంటోంది. జూలూరుపాడు సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఓ రైతు బంతిపూలు విక్రయిస్తున్న దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

– జూలూరుపాడు, న్యూస్‌టుడే



పాఠశాల ఆవరణలో స్వచ్ఛ శ్రమదానం

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా తెలంగాణ హైస్కూల్‌లో పురపాలక, ఈ శ్రీ ఫౌండేషన్ ఐటీసీ వావ్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛ శ్రమదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ అంతటిని విద్యార్థులు స్వచ్ఛందంగా ఏరి కుప్పపోశారు. ప్లాస్టిక్ వినియోగం వల్లే కలిగే అనార్థాలను ఎంఈఓ ప్రభుదయాల్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ జుమ్మికిలాల్, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి, ఎన్‌సీసీ అధికారి బి.వీరునాయక్, ఎన్‌సీసీ సభ్యులు, వావ్ ప్రతినిధి పి. రవి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



వేతనాలు పెంచాలని ధర్నా

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో ఒప్పందకార్మికుల వేతనాలను పెంచాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బి.మధు, నాయకులు గట్టు మహేందర్, రవివర్మ, రాజేశ్, సతీష్ నాయకత్వం వహించారు.

వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్వంచకు చెందిన ఓ వ్యక్తి రూ.50 వేలు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని షేక్ బాదుల్లా అనే లారీ యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై సుమన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాల్సిందే: కూనంనేని

చుంచుపల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే ఉపేక్షించేదిలేదని వాటిల్లో లోపాలుంటే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యానగర్‌కాలనీలో డీఎంఎఫ్ నిధులు రూ.67 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఎంపీడీవో అశోక్‌కుమార్, డీఈ సత్యనారాయణ, ఏఈ నాగేందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా పాల్గొన్నారు.



విద్యానగర్‌కాలనీలో రూ.67 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పేదలకు, కర్షకులకు, కార్మికులకు ఎర్రజెండానే భరోసాగా నిలుస్తోందని, ప్రజల పక్షం పోరాడి ప్రజా సమస్యలు పరిష్కారంలో తిరుగులేని పార్టీ సీపీఐ అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఉల్వనూరు, నర్సింహాసాగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో పర్యటించారు. సుమారు 100 కుటుంబాలు పార్టీలో చేరడంతో పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే స్వాగతించారు.

చుంచుపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లావాసి చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహిస్తున్న గ్యాంగ్ స్టర్ చిత్రం ఈనెల 25న విడుదల అవుతున్న సందర్భంగా సోమవారం కొత్తగూడెం, వైరా ఎమ్మెల్యేలను ఆయన కొత్తగూడెంలో కలిశారు. వారిచే చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరింపజేసి చిత్ర విశేషాలను తెలిపారు. పూనమ్‌రాయ్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలకు సన్మానం

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ పొందిన ఎస్సైలు శ్యామ్‌సుందర్ రావు, శ్రీనివాసరావులను ఎస్పీ బి.రోహిత్ రాజు తన ఛాంబర్‌లో సోమవారం ఘనంగా సన్మానించారు. చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్యామ్‌సుందర్‌రావు, భద్రాచలం ట్రాఫిక్ ఏఎస్సై శ్రీనివాసరావులు గత 40 సంవత్సరాలుగా క్రమశిక్షణతో పోలీసు శాఖకు అందించిన సేవలను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఏసోబు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైల కుటుంబాలతో ఎస్పీ బి.రోహిత్‌రాజు

✪ వర్టికల్స్ వారిగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులకు ఇటీవల డీజీపీ జితేందర్ ప్రశంసా పత్రాలు అందచేశారు. అందులో భాగంగా జూలూరుపాడు పీఎస్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న బి.తిరుపతిరావు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రోహిత్‌రాజు తన కార్యాలయంలో సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్ పాల్గొన్నారు.

'అచ్చక్క మరణం తీరని లోటు'

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: పూనెం లక్ష్మక్క(అచ్చక్క) మరణం విప్లవోద్యమానికి తీరని లోటని ఎన్డీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. మాణిక్యారానికి చెందిన పార్టీ సీనియర్ నాయకురాలు పూనెం లక్ష్మక్క(అచ్చక్క) సంతాప సభను ఎల్లపురం గ్రామంలో మాజీ సర్పంచి మోకాళ్ల కృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నరసింహారావు, మోతీలాల్, కోటమ్మ పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న ఆవునూరి మధు

తిరుపతి లడ్డూ కల్తీ చేసిన వారిపై చర్యలు తీసుకోండి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూ తయారు చేసే నెయ్యిని కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, మాతృ శక్తి, దుర్గా వాహిణి, ఆర్ఎస్ఎస్ తదితర హిందూ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ ఓరుగంటి సురేష్‌కుమార్, ఖమ్మం విభాగ్ సంఘటనా కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, విభాగ్ భజరంగదళ్ సంయోజక్ రామ్‌లోనియ, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రామయణం శర్మ, దారా రమేష్, జిల్లా కార్యదర్శి గంగాదర్ సీత మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌ని కలిసి వినతిపత్రం అందించారు.



అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ, హిందూ సంఘాల నాయకులు

డీఎస్సీ ఫలితాల్లో.. మెరిసిన ఆణిముత్యాలు

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాలు కొత్తగూడెం-ఇల్లెందు నియోజకవర్గాల్లో పలువురు అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకొని ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫలితాల్లో పలువురు గిరిజన ఆణిముత్యాలు మెరిశారు. సరైన వనరులు లేనప్పటికీ ప్రతికూల పరిస్థితుల్లో తమ సత్తా చూపించారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ నేపథ్యంలో వారి అనుభవాలను డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను 'న్యూస్‌టుడే' పలకరించింది.

పాల్వంచ, న్యూస్‌టుడే

ఆన్‌లైన్ తరగతి హాజరయ్యా

నూనవత్ సురేందర్, ఎస్జీటీ ఎంపికైన అభ్యర్థి

మాది పాల్వంచ మండలం బొజ్యాతండా గ్రామం. తల్లిదండ్రులు హరికిషన్, అనసూర్య వ్యవసాయం చేస్తారు. డీఎడ్ పూర్తి చేసి తొలిసారిగా డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యా. పాల్వంచ పట్టణంలో బంధువు ఇంట్లో ఉంటూ పరీక్షలకు సన్నద్ధం అయ్యా. ఆన్‌లైన్‌లో డీఎస్సీ పరీక్షల సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా నోట్స్ తయారు చేసుకున్నా. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో జిల్లాలో 29వ ర్యాంక్ సాధించాడు.



గ్రంథాలయమే ఆధారం.. లావుడియా లక్ష్మి,

ఎస్‌ఏ, ఎస్జీటీ ఎంపికైన అభ్యర్థి

మాది టేకులపల్లి మండలం బొమ్మనపల్లి కొత్తతండా గ్రామం. చిన్నప్పటి నుంచి చదువు అంటే అమితమైన ఆసక్తి. బీఈటీ పూర్తి చేశా. కొత్తగూడెం పట్టణంలోని గ్రంథాలయంలో ఆరు నెలలపాటు పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యా. ఎట్టకేలకు ప్రకటించిన ఫలితాల్లో ఎస్‌ఏ తెలుగు జిల్లాలో 2వ ర్యాంక్‌తోపాటు ఎస్జీటీ జిల్లా స్థాయిలో 31వ ర్యాంక్ కైవసం చేసుకొని ఒకేసారి రెండు కొలువుల్లో ఎంపికయ్యా.





తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని పలువురు అభ్యర్థులు సత్తా చాటారు. టేకులపల్లికి చెందిన గాడిపల్లి శ్రీనివాస్(లేట్)-ఉపేంద్రమ్మ దంపతుల కుమారుడు విష్ణు బాబుగౌడ్ ఎస్జీటీ విభాగంలో 75.33 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంకు పొందారు.



✦ పాత తడికలపూడికి చెందిన కొట్టెం సూర్యనారాయణ - భారతమ్మ దంపతుల కుమారుడు నరేష్ ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 69వ ర్యాంకు దక్కించుకున్నారు.

✦ ఎర్రాయిగూడేనికి చెందిన కుంజ వెంకయ్య - మల్లేశ్వరి దంపతుల కుమారుడు రఘు ఎస్జీటీలో 66వ ర్యాంకు, అతని సోదరి రమ్య కూడా 105వ ర్యాంకు పొందారు. **– టేకులపల్లి, న్యూస్‌టుడే**

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేసిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వినతిపత్రాలు స్వీకరించారు.

✦ ఇటీవల కురిసిన వర్షాలకు పాల్వంచ పట్టణ పరిధిలోని దమ్మపేట-శివనగర్ ప్రధాన రహదారి పూర్తిగా పాడై వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోందని పటిష్టమైన రహదారి, మేజర్ డ్రైనేజీ నిర్మించాలని కోరారు.

✦ రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని 'తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం' ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ప్రధాన కార్యాలయం ఎదుట బీఎంఎస్ ధర్నా

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సీఎంపీఎఫ్ పెట్టుబడిలో జరిగిన అవినీతిపై విచారణను జరిపించాలని, ట్రాన్స్‌కో, జెన్కో నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయాలని కోరుతూ బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అప్పాని శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సారంగపాణి, మాధవనాయక్, రాంసింగ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

(c) eenadu